అరుణతార

కథలు సంకలనం: 31

# బొంద జూడనైతి

మరికొన్ని కథలు • 2002



తొలి ప్రచురణ : ఆగస్టు 2018

ముఖచిత్రం : రాజు ఈపూరి

*ప్రచురణ*

**చరిత**

12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,

ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్,

గోకుల్‌నగర్, తార్నాక,

సికింద్రాబాద్ - 500 017.

ఫోన్ : 9866559867

*ప్రతులకు*

నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు.

ఫోన్ : 040-24652387

అనేక బుక్‌స్టాల్, విజయవాడ.

ఫోన్ : 8977493465

***వెల రూ. 30/-***

*ముద్రణ*

చరిత ఇంప్రెషన్స్

హైదరాబాద్ - 500 020.

# కథల సూచిక...


| | | | |
|---|---|---|---|
| 1. | భూములెవరివి | - కృష్ణ | 7 |
| 2. | నెత్తురోడుతున్న నేల | - నల్లూరి రుక్మిణి | 15 |
| 3. | హింసపాదు | - బమ్మిడి జగదీశ్వరరావు | 23 |
| 4. | దాడి | - ఉదయమిత్ర | 35 |
| 5. | రష్యాను పాలిస్తున్న పెద్ద | - ఎలెక్స్‌యెవ్ | 41 |
| 6. | మయసభ | - బమ్మిడి జగదీశ్వరరావు | 44 |
| 7. | జనకు జనా | - జి.వెంకటకృష్ణ | 52 |
| 8. | బకాసుర కథ | - కె.వి.కూర్మనాథ్ | 58 |
| 9. | ఒక చల్లని మేఘం | - యం.హరికిషన్ | 67 |
| 10. | బొంద జూడనైతి | - జమీన్ | 74 |
| 11. | కొరియర్ | - కె.వి.కూర్మనాథ్ | 92 |

# భూములెవరివి

## కృష్ణ

చలికాలం రోజులు రాత్రి మూడు గంటలయ్యింది. తలుపు గొళ్ళెం కొడుతూ ఉప్పలయ్య అనే పిలుపు విని లేచి తలుపులు తీసిండు. అంతే ఎదురుగా తుపాకులతో పోలీసులు. ఇంటిచుట్టు కూడా పోలీసులే. నడువ్‌మంటు ఉప్పలయ్య చెయ్యిపట్టి లాక్కెళుతున్నారు పోలీసులు. చద్దరు కాదుగదా, చెప్పులు కూడా తొడుగనియ్యకుంటానే తీసుకెళ్ళి లారీలో పడేసింద్రు. ఉప్పలయ్యకి 60 ఏండ్లు ఉంటాయి. ఆయనతో పాటు సాకలి సమ్మయ్యను, కోతి సమ్మయ్యను, కొంతమంది రెడ్డోళ్ళను మొత్తంగా నాగారం నుండి ఇరవైమూడు మందిని లారీ ఎక్కించుకుని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోయింద్రు పోలీసులు. తెల్లారేసరికి నాగారంలో వాడవాడన ఇదే చర్చయితాంది. పట్టుకుపోయినోళ్ళలో మంగలి ఉప్పలయ్యే ముసలోడు. వృత్తిలో నైపుణ్యం గలవాడు. అందరిలో కలుపుగోలుగా ఉంటాడు. పైగా కులపెద్దమనిషి కూడా.

"ఏమాయెరా లచ్చులు ఎడ్లనిడ్చినవా" అనుకుంటా గొల్లోల్ల రాయకొంరు లచ్చులు గొడ్ల కొట్టం కాడికి పోయిండు.

"ఇడుస్తాన్నే" అనుకుంట లచ్చులు ఎడ్లనిడ్సిండు. లచ్చులు ఎడ్లు, రాయకొంరు ఎడ్లు కల్సి నడుస్తున్నాయి. వాటెనుక లచ్చులు, రాయకొంరు నడుస్తున్నారు. లచ్చులు, రాయకొంరు పక్క పక్క భూములున్నోళ్ళు. కలిసిమెలసి ఉంటారు. వీళ్ళ బాయిలకాడికి దళం వస్తే వీళ్ళతో కల్సి మాట్లాడి పోతుంటారు.

"నాత్తిరి సంగద్దెల్సిందా?" రాయకొంరు.

"తెల్వలేదే! ఏంటిదే?" లచ్చులు.

"నాత్తిరి పోలీసోళ్ళొచ్చి మంగళి ఉప్పలయ్యను, సాకలి సమ్మయ్యను, కోతి సమ్మన్ని, ఇంకా ఇరవైమందిని పట్టుక పోయిండ్లటరా. అండ్ల కొందరు రెడ్డోళ్ళు కూడా ఉన్నరట" అన్నాడు రాయకొంరు.

"ఎందుకే? వాళ్ళేమన్న నస్కిలేట్లానే? పొద్దుందాక దొరుకరా? నాత్తిరే ఎందుకు బట్టుకపోవాలే?" అన్నాడు లచ్చులు.

"ఎమ్మోరా! నీ అవ్వ వాళ్ళందరేమో గాని గీ మంగలోల్ల ముసలోన్ని కొడుతార్రా?" అన్నాడు రాయకొంరు.

"కొడుతరా ఏందే! వాళ్ళ సేతులకు బోయినంక ఎముని సేతులకు బోయినట్టే కాదే! ముసలోన్ని జూడరు, ముడిగోన్ని జూడరు. నాకు నిన్ననే గడ్డం జేసిండే ఉప్పలయ్య నాయినా" అన్నాడు లచ్చులు.

"ముసలోడైనా కూడా ఎంత మంచిగ జేత్తడ్రా శౌరం" అన్నాడు రాయకొంరు.

వీళ్ళు ముచ్చట్లో పడేసరికి ఎడ్లుబోయి బఱ్ఱె బచ్చిరెడ్డి మిరపతోట్ల పడ్డయి. బచ్చిరెడ్డి 30 ఎకరాల భూస్వామి. వీడు వూళ్ళో విషయాలన్నీ స్టేషన్లో చెప్పుతావుంటడు. పోలీసులతో దోస్తీ ఉన్నది.

"లం...ఎవ్వర్రేయ్" అని బచ్చిరెడ్డి కేకేసిండు. ఆ కేకతో ఒక్కసారి ఉలిక్కిపడి లచ్చులు, రాయకొంరు తోట దిక్కు ఉరుకుడు మొదలుబెట్టింఁడ్రు. బచ్చిరెడ్డి తిట్లాపకుండ తిట్టుమీద తిట్టు తిడుతూనే ఉన్నాడు.

లచ్చులు, రాయకొంరు ఎడ్లను తోట్లనుండి వాళ్ళ సెలుక కాడిబాటి పట్టిచ్చింఁడ్రు. ఇంకా బచ్చిరెడ్డి తిట్లాపలేదు. లచ్చులుకు కోపం వచ్చింది.

"ఏందయ్యో ఏం బాగా తిడుతానవ్?" అన్నాడు లచ్చులు రోషంగానే. లచ్చులు ఈ మాటన్నడో లేదో పాతరోజులనుకున్నడో ఏమో బచ్చిరెడ్డి కట్టెబట్టుకొని లచ్చులును కొట్టబోయిండు.

రాయకొంరు ఆ కట్టెనందుకొని "ఏందయ్య బచ్చిరెడ్డి, ఊకుంటాంటే ఏమో లగాయించి వురికొత్తానవ్ కొట్టడానికి" అన్నాడు.

లచ్చులు కదలకుండ నిల్చొని గుడ్లురిమి చూసిందు బచ్చిరెడ్డిని. అంతే బచ్చిరెడ్డి వెనక్కి తగ్గి, అమ్మ నా కొడుకుల్లారా ఇంతదాకా వచ్చిందా మీ యవ్వారం

# హింసపాదు

*బమ్మిడి జగదీశ్వరరావు*

ఒడుపుగా 'ఫట్'మని ఉలిమీద తగిలిన సుత్తి దెబ్బకు కపాలం పైకప్పు సగభాగం తెరుచుకుంది.

.....చేస్తున్న పని కొనసాగించబోతూ అనుమతి కోసం చూసాడు అటెండరు. వయసు మళ్ళిన తెల్లదుస్తుల పెద్దాయన చెయ్యెత్తి కన్నార్పి కాస్తంత ఆగమన్నట్టు చేసిన సంజ్ఞని సంకేతాలుగా అందుకున్నాడు. అలాగే ఆ గది బయటకు చూసిన చూపులోని భావాన్ని అందుకొని అటెండరు బయటకు నడిచాడు.

కొద్దిసేపటికే అటెండరు మరో ఇద్దరు హెల్పర్లతో ఇంకో ఆయాతో కలసి మరో స్ట్రెచర్ని తోసుకుంటూ వచ్చాడు. బాల్స్‌పోయి వీల్స్ రోలవకపోవడంతో మొండికేస్తున్నట్టు వికృతమైన శబ్దం ప్రతిధ్వనిస్తోంది. ఆ స్ట్రెచర్ మీద తెల్లని వస్త్రం కింద ఉన్న నడివయసామె ఆ గదిలోకి రానన్నట్టుగా గొంతెత్తి ఏడుస్తున్నట్టుగా ఉంది. బలవంతంగా తీసుకొస్తున్నట్లు ఆమెను బలంగా అమాంతం క్లాత్‌తో సహా ఎత్తి టేబుల్ మీద దించారు.

బట్టల్ని తొలగించాక ఏ ఆచ్ఛాదనా లేని ఆ స్త్రీ కాస్తంత ముడుచుకుపోయి ఉంది. సిగ్గుతో కాదు. ముందే ఆమె ఒళ్ళు చచ్చిపోయింది. శరీరం బిగదీసుకుపోయి ఉంది.

అటెండరు లోపలి గదిలోకి పోయి మళ్ళీ లిక్కరు సీసానెత్తి గొంతు తడుపుకున్నాడు. హెల్పర్లు గుటకలు వేస్తూ నిల్చున్నారు. ఒకటికి రెండు దఫాలు

మిగిల్చింది తాగి, చెక్ చేసుకు మరీ వచ్చాడు. వాళ్ళంతా తాగడం తెల్లచొక్కా గమనించినా అలవాటుగా పట్టించుకోలేదు.

ఆయమ్మ ఇవేమీ పట్టించుకోకుండా అవసరమైన పనిముట్లని శుభ్రపరిచి ట్రేలో సర్ది బయటకు వెళ్ళిపోయింది.

అప్పుడే ప్రవేశించిన జూనియర్ డాక్టర్లు ముగ్గురూ ఆలస్యమయినందుకేమో సారీ చెపుతూనే, తమ ఫ్రెండు చూస్తానని వచ్చాడని అలౌవ్ చేయమని రిక్వెస్టు చేశారు. వెనకాలే వచ్చిన పీజీ అసిస్టెంటు రికమండేషనుతో ఆ పెద్దాయన ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ ఆమోదంగా తలాడించారు. జూనియర్ డాక్టర్లలో ఒకామె వెళ్ళి స్నేహితుణ్ని లోపలకు తీసుకువచ్చింది. పరిచయాలూ, నమస్కారాల మధ్య పని ప్రారంభమయింది.

కొత్త కుర్రాడు ముక్కు మూసుకోబోతే 'స్పిరిట్' వినబడీ వినబడనట్టు అని, చూడమన్నట్టుగ చూసింది ఆ లేత డాక్టరు.

'మొదట ఎక్సటర్నల్స్ చూస్తామన్నమాట...' పీజీ అసిస్టెంటు చెప్పుకు పోతున్నాడు. 'కట్స్, ఇంజ్యూరీస్ ఎమైనా ఉంటే...' చెపుతూ ఉంటే ఆ స్త్రీ దేహమంతా తిప్పి, తరచి మరీ వెతికారు. అలా వెతుకుతుంటే ఏ అర్థంలోనో ఎందుకో మరి 'డిపార్టుమెంటుది' అన్నారు ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్. పెద్దగా వెతకనక్కర్లేదు అన్నట్లు అశ్రద్ధగా ఉంది అతని మాట.

అదంతా రిపోర్టుకి సంబంధించింది. మీ ఇష్టం అన్నట్టుగా పీజీ అసిస్టెంటు తలాడిస్తూనే అబ్జర్వర్లకు విపులీకరిస్తున్నాడు.

హెల్పర్ ఎప్పుడూ ఉండే సోదేనన్నట్లుగా అదేమీ పట్టించుకోకుండా పాన్ నములుతూ రేజరు కత్తితో తల దగ్గరకొచ్చి కూర్చున్నాడు. దాదాపుగా కాలిపోయిన జుత్తు మాడి అట్టగట్టుకుపోయి ఉంది. కపాలానికి అంటుకుపోయి ఉంది. గొరుగుతూ ఉంటే మాడిన జుత్తు ఎండి పెలుసులు రాలింది. చర్మం కాస్తంత కాలి కమిలిందేమో పొరలు పొరలుగా ఊడొచ్చింది.

గుండు గీస్తున్నందుకు ఆమె సిగ్గు పడలేదు. నగ్నంగా ఉన్నందుకూ సిగ్గు పడలేదు. కాలిన తొడలూ పురజాలూ గుండెలూ గాయాల గుడ్డను కప్పుకొని ఉంది. కాలిన అరచేతులు రహస్యాన్ని దాచుకున్నట్టు పిడికిళ్ళు బిగించి ఉన్నాయి. ఆమె ముఖం కడిగిన ముత్తెంలా ఉంది.

'సిగ్గుతో అలా తల దించుకుంటే కడిగిన ముత్యాన్ని ఎలా చూసేది?' వరసైన ఆడవాళ్ళ నవ్వులు.

# దాడి

ఉదయమిత్ర

సన్నటి ముసురు పేదోడి ఉసురు లాగ ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాను ఆవరించిన పేదరికంలాగ ఎటు చూసినా చీకటి. నిజానికి అప్పుడప్పుడే పొద్దుగూకినా ఆకాశంలో నల్లమబ్బులు ఆవరించడం మూలాన ఎప్పుడో పొద్దుగూకినట్లుగా ఉంది. ఆ చీకటిలో, ఆ ఒంటరితనంలో నల్లమబ్బుల ఆకాశం పోలీసు క్యాంపులా ఉంది.

ఊరి పక్కన నల్లవాగు నల్లనాగులా మెలికలు తిరుగుతోంది. దాని వెడల్పు తక్కువగా ఉండటంతో వర్షమొస్తే చాలు, దాని వేగాన్ని, కోపాన్ని తట్టుకోవడం చాలా కష్టం. నురగలు కక్కుతూ అది ప్రవహిస్తుంటే, చూసే వాళ్లకి భీతి కలుగుతుంది. ఊరి పక్కనే ఉండటంతో రాత్రి పూటయితే దాని హోరు వాళ్ళ గుండెల్లో పరుగెడుతుంది. అది ఎప్పుడు గట్లు తెంచుకుని ఇళ్లను ముంచి వేస్తుందోనని భయం వాళ్ళకుంది.

గడిచిన అరవై ఏళ్ళుగా ఆ వాగు మీద వంతెన నిర్మించాలన్న యోచన ఎవరికీ రాలేదు. ఆ ఊరు మండల కేంద్రమైన అడివికి దగ్గరగా ఉండటంతో దాన్ని పట్టించుకునే నాథుడే లేదు. వర్షమొస్తే చాలు, నల్లవాగు ఉధృతం మూలాన ఆ మండల కేంద్రానికి, దాని చుట్టుపక్కల ఊళ్ళకి, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఓ విధంగా ఆ నల్లవాగు ఆ మండలానికి శనిలా దాపురించింది.

ఆ సమయాన వాగుపక్కన ఉన్న చెట్టుకింద ముగ్గురు ఆదివాసులు నిలబడి ఉన్నారు. అందులో ఒకతను 'అమ్మో!అమ్మో! అని బాధతో మెలికలు తిరుగుతున్నాడు. కింద అంతా బురద. నిలబడే ఓపిక లేక పక్క వాడి మీద నిస్సహాయంగా ఒరిగిపోతున్నాడు. అతని మూలుగులు అరుపులు తప్ప, ఆ చీకట్లో నింగి నేల పగబట్టిన సమయాన... ఆ సమయాన అక్కడ మనుష్యు లుంటారని ఎవరూ ఊహించరు. అతని కుడి చేయికి, కుడి పక్కకి రుమాలు లాంటిదేదో చుట్టేరు. కుడి చేతి నుండి రక్తం బొట్లు బొట్లుగా కారుతోంది.

ఆ వ్యక్తి పేరు గంగారాం. అతడారోజు పొలంలో పని చేసుకుంటుండగా అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. అతను బిత్తరపోయి అరుచుకుంటూ వెళ్ళి దగ్గర్లో ఉన్న చెట్టెక్కే ప్రయత్నం చేసాడు. వెంటబడిన ఎలుగబంటి అతని కుడి చేయి దొరకబుచ్చుకుని 'పప్పు పప్పు' గా నమిలేసింది. కుడికాలు పిక్కను కూడా పీకింది. ఈ లోపున చుట్టుపక్కల వాళ్ళు రావడంతో పారిపోయింది.

అదరాబాదరాగ కాలికి, చేతికి మురకి రుమాలను చీల్చికట్టి ఇంటికొచ్చె దాక ఇంటోల్లకు ఏమి జరిగిందో తెలవలేదు. ఊరంతా పోగయింది. ఒకవేపు కొట్టుకొల్లు, మొత్తుకొల్లు అవుతుండగానే, మరోవేపు నంజూరు మండలానికి బండి సిద్ధం చేశారు.

సాయంత్రం వేళ గతుకుల రోడ్డు మీద బండి బయలుదేరింది. వాళ్ళ ఊరికి మండల కేంద్రం పది కిలోమీటర్ల దూరాన ఉంది. గాయపడ్డ వ్యక్తిని ఎడ్ల బండిలో వేసుకుని, ఆ కచ్చా రోడ్డులో, ముసురు పడుతుంటే ప్రయాణించడమంటే ఏమిటో స్వయాన అనుభవిస్తేనేగాని తెలుస్తుంది. అదొక్కటే కాదు పుండుమీద కారం జల్లినట్లు వాళ్ళు ఒకే వాగును రెండుసార్లు దాటాలి. కొన్నిసార్లు బండి పయ్యాల్ని పట్టీ, కొన్నిసార్లు ఇతరుల సాయంతో నెట్టి, ఎట్లాగయితేనేమి చీకటి వేళకు నంజూరు మండల కేంద్రానికి వచ్చారు.

అక్కడ ప్రైవేటు డాక్టరుకు చూయించారు. వాడు గబగబా రెండు సూదులిచ్చి, వంద రూపాయలు గుంజి వదిలిపెట్టేడు. చిలుం వదిలింది గాని రక్తస్రావం ఆగలేదు.ఇక ఏ మాత్రమూ ఆలశ్యం చేయక, వాళ్ళు గంగారాంను ఎత్తుకొని వాగువేపు నడిచేరు. బండి ఎక్కడో దిగబడి పోవడంతో వాళ్ళు నడవక తప్పలేదు.

✠ ✠ ✠

వాగు ఉధృతి కొంచెం తగ్గినా, పరిస్థితి ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు. ఓ వేపు చీకటి ముసురు. ఒంటరితనం. ఇప్పుడా ముగ్గురు వాగు దాటి బస్సెక్కాలి.

# జనకు జనా...

జి. వెంకటకృష్ణ

రైలు వేగంగా పరుగెడుతోంది...

అహమ్మదాబాద్ నుండీ వరంగల్ వైపు...

ఇది రైలు కాదు, పాటల బండిలా ఉంది నాకు.

నా ఎదురు సీట్లల్లోనే పాటల బృందం ఉంది. ఎనిమిదిమంది యువకులు జనం పాటలు వాళ్ళ గొంతుల్లో గుండెల్లో నుంచీ దూకుతున్నాయి, దప్పు సవ్వడితో పాటు...

అందులోనూ తెలుగు గుండెల సవ్వడి, ఇలా అనుకోకుండా ప్రజా కళాకారుల కచేరీలో భాగమవడం అదృష్టంగానూ ఉద్విగ్నంగానూ ఉంది, జన తెలంగాణా గుండె చప్పుళ్ళు వీళ్ళ గొంతుల్లో..దప్పు దరువుతో పాటు వింటున్నందుకు.

'సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో...' అన్నా

'బండెనక బండి కట్టీ పదహారు బండ్లు కట్టీ...' అన్నా

'అడవి తల్లికి దండాలో... మా తల్లి అడవికీ దండాలో...' అన్నా

'ఎఱ్ఱజెండ్ ఎఱ్ఱజెండ్ ఎన్నియల్లో ఎఱ్ఱెఱ్ఱని జెండకు ఎన్నియల్లో...' అన్నా

'కెన్సారో వివా... కెన్సారో వివా...' అంటూ ఆఫ్రికా వీరుణ్ని కీర్తించినా.

ఆ మాధుర్యమూ, ఆ గొంతుల్లో భావోద్వేగమూ నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.

ఇంత పబ్లిక్‌గా పాటలు పాడుతున్న వీళ్ళు నిజంగా తెలుగు సాంస్కృతిక సైన్యంలా కనబడుతున్నారు నా కళ్ళకు.

పాటల్లో ఏదో సమ్మోహనం మనసును నిలువనీయడం లేదు. డప్పు కొడుతూ గొంగడి భుజాన వేసి చిందులు వేస్తూ ఓ అసమాన ప్రజా కళాకారుడు వీళ్ళ గొంతుల్లోని పాటలతో పాటు నా స్మృతుల్లో కలసి..నన్ను నా బాల్య స్మృతుల్లోకి లాక్కుపోతున్నాడు.

చిన్నప్పటి నా నేస్తం మాదిగ వెంకటేశులు వెంబడి నేను పెట్టిన పరుగుల్లోకి...

వాడి చేతుల్లోని డప్పును లాక్కోవాలనే తీరని ఆరాటంలోకి... అట్లా వాడి వెంబడి పడి తిరిగేది నాయన చూస్తే తంతాడనే భయాల్లోకి...

పీర్ల పండగలప్పుడు అలాయ గుండం ముందు లయబద్ధంగా పడే తప్పెట దరువుల్లోకీ, లయబద్ధంగా కదిలే అడుగుల్లోకి... నాన్న భయంతో పీర్ల పండగ సంబరాల్లో భాగం కాలేని నా అసహాయతల్లోకి..

ఎప్పటెప్పటివో అనుభవాల్లోకి... పాత వాసనల్లోకి... అన్నీ రైలు భోగీల్లాగా ఒకదాని వెంబడి మరొకటి, ఒకటి కదలిందంటే, మనసులో మెదిలిందంటే దాని వెంబడే మిగతావన్నీ...

ఎక్కడ ఎప్పుడు డప్పు శబ్దం విన్నా అంతే, అది నా అంతరాలల్లో, నా గుండె లయలో భాగమై చాలా కాలం వెంటాడుతుంది. పొద్దున్నే లేస్తూనే ఏదైనా పాట వింటే అది ఆ దినమంతా మనల్ని వెంటాడినట్లు, డప్పు శబ్దం ఎప్పుడు విన్నా అది నా ఆలోచనలన్నింటా ప్రతిధ్వనిస్తుంది.

చిన్నప్పుడు మా వెంకటేశులకి పోటీగా చిన్నచిన్న డప్పులు తయారు చేసుకునే వాడిని. మట్టి కడవల, కుండల కంఠాలకు బంకతో పేపర్ను అతికించి చిటికెన పుల్లలతో వాయించే వాడిని. పగిలిపోయి, పారేసిన కడవలూ, కుండల కోసం వూర్లో వీధులన్నీ వెతికే వాణ్ణి. బుల్లి బుల్లి డప్పులు తయారుచేయడం వాటిని దాచుకోవడంలో గొప్ప ఆనందం అనుభవించేవాణ్ణి.

పెరిగి పెద్దయ్యే కొద్దీ వెంకటేశుల్ని మరిచిపోయినట్లే డప్పునూ మరిచిపోయానేమో, అప్పుడప్పుడు ఇట్లాంటి కళాకారులు గుర్తు చేసినప్పుడు వెంకటేశులూ, చిన్ననాటి బుల్లి డప్పులూ వెంటాడతాయి.

ఎదురు సీట్లలో పాటల బృందం ఆదమరచి నిద్రపోతున్నారు. ట్రైన్ కదలికల్లో ఆ వూపుల్లో చెరువు నీటి అలలపై తూగుతున్న, ఎర్ర కలువల్లా ఉన్న

# బొంద జూడనైతి

జమీన్

"అరె ఒక పిట్ట జాడన్న లేదు. ముసలాయ్నకు ఏమాసలున్నయో" అంది కమలమ్మ దూరంగా ఆకాశంలోకి చూస్తూ.

"ఇజయమ్మా, సుగుణమ్మా మీ ఇద్దరు మల్లొసారి పోయి ఇద్దరం కల్సిమెల్సుంటమని, అమ్మను మంచిగ జూసుకుంటమని నాయ్నకు దండం బెట్టుండ్రి బిడ్డా" వీరమ్మ చెప్పింది.

ఆమె చెప్పినట్టుగనే విజయమ్మ, సుగుణమ్మ ఇద్దరూ పిట్టకు పెట్టిన దగ్గరికి పోయి మళ్ళొసారి దండంబెట్టి అందరు కూర్చున్న చెట్టునీడకు వచ్చేసారు.

"ఉహు అయినా ముద్దతలేదు గదా. మామ మనసుల ఏముందో అందరొచ్చినట్టేనా? ఇంకెవలన్న రానోల్లుండ్రా? మామ ఎవరి కోసమన్నా ఎదురుజూస్తుండా?" అని ఓసారి చుట్టూ చూసి "అందరొచ్చినట్టే గదా పిట్టెందుకు ముద్దతలేదో" అన్నాడు రాములు.

"పెదనాయ్నకు ఇష్టమయినయన్ని బెట్టినట్టేనా? అరె పెదనాయ్నకు విస్కంటే ఇష్టం గదా. పడి సచ్చెటోడు. మనం విస్కి తేనట్టున్నం గదా!" ఎంకన్న.

"అరె నిజంగనే! అందరం మర్సిపోయినం గద. ఇగో ఎంకన్న బండి మీద బోయి జల్ది ఓ సీస అందుకరా పో" జేబుల్నుంచి పైసలు తీసిస్తూ ఎంకన్న చేతిలో పెడ్తూ అన్నాడు రాములు.

అక్కడ జరిగే తంతును నిర్లిప్తంగా చూడసాగింది మాధవి. మాధవి తాతయ్య

సత్తెయ్య చనిపోయి పదిరోజులయింది. ఈ రోజు దినాలు. అందరితోపాటు యాంత్రికంగా వాగులోకి వచ్చిందామె. చనిపోయిన వాళ్ళకు ఇష్టమయిన పదార్థాలను బంధువులూ, స్నేహితులూ అందరూ వచ్చి పెడితే చనిపోయిన వాళ్ళు పిట్ట రూపంలో వచ్చి తినిపోతారనే నమ్మకాన్ని ఆచారంగా అందరూ పాటిస్తారు. కానీ మాధవికి ఆ ఆచారం పట్ల ఏమాత్రం నమ్మకం లేదు.

"బాగ ఎండెక్కింది. పక్షులేం ఉంటయ్ ఈ ఎండల. ఇప్పుడు విస్కీ పోసిన ఏం బోసిన వృథా" మనసులో అనుకుంది మాధవి – పైకి అన్నా వాళ్ళెవరూ పట్టించుకోరని.

పావుగంటలో విస్కీసీసా రానే వచ్చింది. రాములు సీసాను తీసుకెళ్ళి పిట్టకు పెట్టిన చోట మొత్తం ఒంపేసి దండం బెట్టాడు. అందరూ మళ్ళోసారి దండం బెట్టారు. అయినా పిట్ట జాడలేదు.

"ఉహు లాభం లేదు. ఇగింత సేపుండమీడ. ఇంటికి పోయి చెయ్యాల్సిన కార్యక్రమం ఉందాయె. మళ్ళ భోజనాలగ్గాడ పొద్దుపోతది. ఇయ్యన్ని తీసి బాయిల కలిపేద్దం" రాములు.

"అవు గంతే జేద్దాం. ఇంకెంత సేపు కూసుంటం. ఎండ దంచుతాంది. ముత్తాలమ్మ బాయిల్నే గదా కలిపేది" కమలమ్మ.

"ఆ గదే దగ్గరయితది. సురేషూ దా ఇయ్యన్ని మూట కట్కొని తీస్కపోదం" పిట్టకోసం పెట్టిన వాటిని ఒక్కోటి తీస్తూ అన్నాడు రాములు. సురేష్ కూడా సాయం చేయసాగాడు.

రాములు సత్తెయ్య చెల్లె కొడుకు. సురేష్ సత్తెయ్య చిన్నబిడ్డ కొడుకు. సత్తయ్యకు ఇద్దరే బిడ్డలు. పెద్దబిడ్డ విజయమ్మకు ఒక్కతే బిడ్డ మాధవి. చిన్న బిడ్డ సుగుణమ్మకు ఒక కొడుకు ఇద్దరు బిడ్డలు. కొడుకుల్లేనందువల్ల సత్తెయ్యకు మనవడు సురేష్ తలకొరివి పెట్టాడు. ప్రస్తుత తతంగం కూడా సురేష్ చేతుల మీదుగా నడిపిస్తున్నారు.

"ఆఁ ఇంగపాండ్రి. అందరు పాలోల్లు, తానాల చేయాల్సినోళ్ళు అందరు పాండ్రి. ఆడ్నే బాయికాడ తానాలు జేద్దాం" అన్నాడు సత్తెయ్య తమ్ముడు నారాయణ.

స్నానాలు జేసి 'మైల' వదిలించుకోవాల్సిన వాళ్ళు బాయివైపు నడిచారు. ఆ అవసరం లేనివాళ్ళు తిరుగుముఖం పట్టారు.

"రా అక్కా పోదాం. మనకు స్నానాల బాద లేదుగా" సౌమ్య పిలిచింది మాధవిని.

# కొరియర్

కె.వి. కూర్మనాథ్

ఇది నా అనుభవం. నాది అంటే నాదే కాకపోవచ్చు. మీది కూడా కావచ్చు. చాలా వరకు అనుభవాలేవీ వ్యక్తిగతం కాదు. అందుకే ఇది నాదో మీదో మీ ఫ్రెండ్‌దో అయి వుండొచ్చు. కానీ ఇట్లాంటి అనుభవం మనదే అనిపిస్తుంది. నాకలాగే అనిపించింది. ఇది ఓ ప్రయాణానికి సంబంధించిన అనుభవం. ఎన్నో ప్రయాణాలు ఇదివరకు చేసేను గాని ఈ ప్రయాణానికి ముందున్న జీవితానికీ తర్వాత జీవితానికీ పూర్తిగా పోలిక లేకుండా చేసిన ఒకానొక ప్రయాణం గురించి చెబుతాను. ఒక పెను ఉపద్రవం తర్వాత, మర్రివృక్షాలను వేళ్ళతో సైతం పెకలించి వేసే తుఫాను వచ్చిపోయిన తర్వాత, ఊపిరాడని గదిలోంచి బయటికి వస్తే తగిలిన చల్లటి గాలి స్పర్శవలె, ఏళ్ళనాటి దాహం తీరుస్తూ పడిన ఒక వాన చినుకువలె అనిపించిన ఒక ప్రయాణం గురించి చెబుతాను. మీలో కొందరు ఇట్లాంటి ప్రయాణాలు చేసి వుండొచ్చు. ఆ ప్రయాణం వెంబడి ఉద్యోగమూ, ఆందోళనా, అతిశయమూ, అబ్బురమూ, నిర్వేదమూ, ఆశనిరాశలు కలిగించే సంఘటన లెన్నింటినో చూసి ఉంటారు. కొందరు విని ఉంటారు. కొందరికి మాత్రం ఈ ప్రపంచం అసలు లేనేలేదు. ఆ ప్రపంచంపట్ల నిర్హేతుకమైన, అసంబద్ధమైన కోపంతో ఊగిపోతుంటారు. అట్లాంటి వాళ్ళెవరికైనా ఒక కొత్త ప్రపంచపు విభ్రమ కలిగించే సాధారణత్వమూ, అనూహ్యమైన ఆప్యాయత, అచంచలమైన విశ్వాసమూ, తెగువా పరిచయమైతే ఎట్లాంటి అలజడికి గురవుతారో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Arunatara+Kathalu+Volume+31**

* * *